## విద్య, వైద్యరంగాలకు సముచిత ప్రాధాన్యం

బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి




బోధన్‌లో పుస్తకాలు అందజేస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, డీఈవో

బోధన్, జూన్ 12: విద్య, వైద్య రంగాలకు రాష్ట్ర ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యమిస్తున్నదని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యాబోధనను అందించడంతో పాటు మౌళిక సదుపాయాలను మెరుగుపర్చుతున్నామని వివరించారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా బోధన్ పట్టణంలోని రాకాసీపేట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతుతో కలిసి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తులను బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ బడులను నిర్వహించాలని, ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలని సూచించారు. చదువులో వెనుకబడ్డ విద్యార్థులకు ప్రత్యేకంగా తరగతులు నిర్వహించాలని తెలిపారు. జిల్లాలో 103 మంది ఎస్సెస్సీ విద్యార్థులు 10 జీపీఏ సాధించడంపై అభినందించారు. పాఠశాలల్లో పెండింగ్ పనులను త్వరలోనే పూర్తిచేస్తామని, ప్రభుత్వ బడుల్లో పిల్లలను చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. అనంతరం కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు 'బడి బాట' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ఆధ్వర్యంలో జిల్లాలోని 792 ప్రభుత్వ పాఠశాలల్లో టాయిలెట్స్ నిర్మాణం, తాగునీటి సరఫరా తదితర మౌలిక వసతుల కల్పన పనులు జరుగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో డీఈవో దుర్గా ప్రసాద్, రాష్ట్ర సహకార సంఘాల యూనియన్ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, బోధన్ ఆర్డీవో అంబదాస్ రాజేశ్వర్, మున్సిపల్ కమిషనర్ వెంకటరమణ, ఎంఈవో నాగనాథ్, హెచ్‌ఎం బాలచంద్రం తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ బడులను బలోపేతం చేస్తాం

నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి



విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, దుస్తులను అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి

ధర్పల్లి, జూన్ 12: ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేసి మెరుగైన విద్య, ప్రతిరోజూ పౌష్టికాహారం అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నదని రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డి అన్నారు. బడిబాటలో భాగంగా ధర్పల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అదనపు తరగతి గదులు, కిచెన్ షెడ్డును ఆయన బుధవారం ప్రారంభించారు. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్‌లాంటి గొప్ప వ్యక్తులెందరో ప్రభుత్వ పాఠశాల ల్లోనే చదివారని, ప్రభుత్వ పాఠశాలల్లో పూర్తిస్థాయి మౌలిక వసతులు, సుశిక్షితులైన ఉపాధ్యాయులతో విద్యాబోధన ఉంటుందని, తల్లిదండ్రులు విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివించాలని కోరారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం, గ్రామస్తులు పాఠశాలకు కావాల్సిన మౌలిక వసతులపై ఎమ్మెల్యేను కోరగా సానుకూలంగా స్పందించారు. ప్రహరీ నిర్మాణం, ఆర్వో ప్లాంటు, స్కావెంజర్, వాచ్‌మెన్ల నియామకానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నల్ల సారికాహన్మంత్‌రెడ్డి, ఎంపీడీవో బాలకృష్ణ, ఎంపీవో రాజేశ్, నాయకులు పాల్గొన్నారు.



బోధన్‌లోని భీమునిగుట్ట ప్రాథమిక పాఠశాలలో మరమ్మతు పనులు పూర్తికాకపోవడంతో పిల్లలు ఉండలేని దుస్థితి



- ప్రభుత్వ బడుల్లో శుభ్రత.. పట్టేదెవరికి?
- అసంపూర్తిగా అమ్మ ఆదర్శ పనులు
- బ్రేక్‌ఫాస్ట్ పథకానికి బ్రేక్...
- వ్యాపారంలో ప్రైవేటు విద్యాసంస్థల సక్సెస్..
- జోరుగా కొనసాగుతున్న పుస్తక, యూనిఫామ్స్ విక్రయాలు
- పట్టించుకోని విద్యాశాఖ అధికారులు

# తొలి రోజు అంతంతే..


కొత్త విద్యాసంవత్సరం షురూ

శంకర్‌భవన్ ప్రైమరీ పాఠశాలలో..





ఆదర్శనగర్ మహిళాభవన్‌లో తరగతుల బోధన



నిజామాబాద్: ఆదర్శనగర్ పాఠశాలలో కొనసాగుతున్న మరమ్మతులు

### తక్కువ సంఖ్యలో విద్యార్థులు

నిజామాబాద్ నగరంలోని పలు పాఠశాలల్లో విద్యార్థులు తక్కువ సంఖ్యలో హాజరయ్యారు. అంబేద్కర్ కాలనీలోని హరిజవాడ ప్రభుత్వ పాఠశాలకు విద్యార్థులు రాలేదు. హమాల్‌వాడీ పాఠశాలలో కేవలం ఐదుగురు మాత్రమే హాజరయ్యారు. రాజీవ్‌నగర్‌కాలనీలోని పాఠశాలకు 20 మంది విద్యార్థులు వచ్చారు. ఆదర్శనగర్ పాఠశాలలో అమ్మ ఆదర్శ పనులు పూర్తికాకపోవడంతో విద్యార్థులను మహిళా భవన్‌లో ఉంచి బోధిస్తున్నారు. పోలీస్ లైన్ పాఠశాలలో పనులు అసంపూర్తిగా ఉండడంతో ఉదయం ప్రైమరీ, మధ్యాహ్నం హైస్కూల్‌ను నిర్వహించారు.

ఖలీల్‌వాడి/ కామారెడ్డి, జూన్ 12: వేసవి సెలవులు ముగియడంతో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు బుధవారం పునఃప్రారంభమయ్యాయి. తొలి రోజు అంతంత మాత్రంగానే విద్యార్థులు హాజరయ్యారు. నిజామాబాద్ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో 89,764 మంది, ప్రైవేటు పాఠశాలల్లో 1,55,044 మంది విద్యార్థులుండగా మొదటి రోజు తక్కువ సంఖ్యలో హాజరయ్యారు. కామారెడ్డి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో 86వేల మంది చదువుతుండగా, 60వేల మంది మాత్రమే హాజరైనట్లు సమాచారం. కొన్ని ప్రభుత్వ పాఠశాలలకు విద్యార్థులు అసలే రాలేదని తెలుస్తుంది. మరోవైపు మొదటిరోజు పాఠశాలకు వచ్చిన విద్యార్థులకు సమస్యలే స్వాగతం పలికాయి. అమ్మ ఆదర్శ పాఠశాల పనులు నత్తనడకన సాగుతుండడంతో నిర్మాణ సామగ్రి ఎక్కడపడితే అక్కడే పడేశారు. కొన్ని పాఠశాలల్లో తరగతి గదులను కూడా శుభ్రపరచలేదు. విద్యార్థులే బెంచీలను మోసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. పాఠశాలలు అస్తవ్యస్తంగా ఉండడంతో విద్యార్థులు చదువుకోవడానికి, ఆడుకోవడానికి ఇబ్బందులుపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం బడిబాట కార్యక్రమం చేపట్టినప్పటికీ స్పందన కనిపించలేదు. కొంత మంది ఉపాధ్యాయులు బదిలీలు, ఉద్యోగోన్నతుల బిజీలో ఉండడంతో పాఠశాలకు డుమ్మాకొట్టినట్లు సమాచారం.

### విద్యా వ్యాపారంలో ప్రైవేటు సక్సెస్..

ప్రైవేటు పాఠశాలల్లో విద్యా వ్యాపారం సక్సెస్ పుల్‌గా కొనసాగుతున్నది. పుస్తకాలు,యూనిఫామ్స్, నోట్‌బుక్స్, టై, బెల్టు, స్పోర్ట్స్ డ్రెస్ తదితర వాటి పేరిట వ్యాపారం నిర్వహిస్తున్నారు. పుస్తకాలు కొనుగోలు చేయని తల్లిదండ్రుల ఫోన్లకు పాఠశాలల నుంచి మెస్సేజ్‌లు వస్తున్నాయి. ఇదంతా తెలిసినా విద్యాశాఖ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండడం గమనార్హం. కొన్ని పాఠశాలలు ఎవరికీ చిక్కకుండా వ్యాపారం కొనసాగిస్తున్నాయి. పాఠశాలకు సమీపంలోనే ఓ దుకాణం ఏర్పాటు చేసి అందులో సిబ్బందితో పుస్తకాలు, యూనిఫామ్స్ విక్రయిస్తున్నారు. ఇంత పెద్ద ఎత్తున వ్యాపారం నిర్వహిస్తున్నా విద్యాశాఖ అధికారులకు తెలియడం లేదా? తల్లిదండ్రులు ఫిర్యాదు చేస్తేనే స్పందిస్తారా? సంబంధిత శాఖకు స్వయం అధికారాలు లేవా? లేకపోతే ప్రైవేటు విద్యాసంస్థలు ఇచ్చే అమ్యామ్యాలకు తలొగ్గి సైలెంట్‌గా ఉంటున్నారా అని పలువురు తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు.



### వెల్లగా మారిన బడులు..

పాఠశాలల పునఃప్రారంభం విషయం తెలిసినా అధికారుల, ఉపాధ్యాయుల నిర్లక్ష్యంతో కొన్ని పాఠశాలలు చెత్తాచెదారంతో దర్శనమిచ్చాయి. రెండురోజుల ముందుగానే బడిని అందంగా ముస్తాబు చేయాల్సి ఉన్నా.. పట్టింపులేని తనంతో అస్తవ్యస్తంగా మారాయి. కొన్ని పాఠశాలల్లో మరమ్మతు పనులు కొనసాగుతుండడంతో పాఠశాల ఆవరణ, తరగతి గదులు విద్యార్థులు కూర్చుండేందుకు వీలు లేకుండా తయారయ్యాయి. మరికొన్ని చోట్ల మరుగుదొడ్లు, తాగునీటి సమస్యలు నెలకొన్నాయి.



కామారెడ్డిలో మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న నిర్వాహకులు



విద్యార్థులు హాజరుకాని హరిజనవాడ పాఠశాల

### బ్రేక్‌ఫాస్ట్‌కు.. బ్రేక్

గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన బ్రేక్‌ఫాస్ట్ పథకం పాఠశాలల పునఃప్రారంభం రోజున కనిపించలేదు. ఉదయం ఖాళీ కడుపుతో విద్యార్థులు తరగతులకు హాజరుకావొద్దనే ఉద్దేశంతో కేసీఆర్ హయాంలో ఈ పథకాన్ని ప్రారంభించింది. కానీ కొత్తగా వచ్చిన ప్రభుత్వం ఆ పథకం అమలును మరిచిపోయినట్లు తెలుస్తున్నది.



మోర్తాడ్ మండలం తిమ్మాపూర్ పాఠశాలలో మరుగుదొడ్ల పరిస్థితి

కమిషనర్‌ను నిలదీసిన ఎమ్మెల్యే కాటిపల్లి

ఎమ్మెల్యేతో వాదనకు దిగిన కాంగ్రెస్ కౌన్సిలర్

# డిష్యుం.. డిష్యుం..

## అక్రమ కట్టడాల తొలగింపుపై బీజేపీ, కాంగ్రెస్‌ల మధ్య వాగ్వాదం



మున్సిపల్ కార్యాలయ ఆవరణలో కాంగ్రెస్, బీజేపీ నాయకుల మధ్య వాగ్వాదం



మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటిపల్లి

కామారెడ్డి, జూన్ 12: కామారెడ్డి పట్టణంలో అక్రమ కట్టడాల తొలగింపు వ్యవహారం బీజేపీ, కాంగ్రెస్‌ల మధ్య వాగ్వాదానికి దారితీసింది. హౌసింగ్‌బోర్డు కాలనీలోని ఓ అక్రమ కట్టడాన్ని మున్సిపల్ అధికారులు బుధవారం కూల్చివేశారు. కేవలం ఒకే కట్టడాన్ని కూల్చివేయడంపై స్థానిక ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి మున్సిపల్ కమిషనర్ సుజాతను నిలదీశారు. కాంగ్రెస్ నాయకుల అక్రమ కట్టడాలను వదిలేసి మిగతా వారివి కూల్చివేయడం ఏంటని ప్రశ్నించారు. ప్రజలను ఇబ్బందిపెట్టే పనులు మానుకోవాలని అన్నారు. పట్టణంలోని అన్ని అక్రమ కట్టడాలను కూల్చివేయాలని అధికారులను ఆదేశించారు. కాంగ్రెస్ నాయకుల అక్రమ కట్టడాలను వదిలేసి రాజకీయ కక్షతోనే ఇతర కట్టడాలను కూల్చివేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే కాటిపల్లి స్వయంగా ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీకి ఫోన్ చేసి ప్రజల కట్టడాలను కూల్చివేయమని మీరేమైనా ఆదేశించారా? అని అడిగారు. తాను అలా ఏం చెప్పలేదని షబ్బీర్ అలీ సమాధానమిచ్చారు. దీంతో ఎవరు చెబితే కట్టడాలను కూల్చివేశారని కమిషనర్‌ను నిలదీశారు. మున్సిపల్ కార్యాలయంలో కొద్దిసేపు కాంగ్రెస్, బీజేపీ కౌన్సిలర్లు ఒకరినొకరు దూషించుకున్నారు. ఎమ్మెల్యే కల్పించుకొని బీజేపీ కౌన్సిలర్లకు నచ్చజెప్పడంతో గొడవ సద్దుమణిగింది. అనంతరం కాంగ్రెస్ కౌన్సిలర్ పాత శివ కృష్ణమూర్తి, ఎమ్మెల్యే కాటిపల్లి మధ్య కొద్దిసేపు వాగ్వాదం చోటు చేసుకున్నది.

### పట్టణ అభివృద్ధికి సహకరించాలి

పట్టణ అభివృద్ధిలో భాగంగా అక్రమ కట్టడాలను కూల్చివేస్తున్నట్లు కాంగ్రెస్ కౌన్సిలర్ పాత కృష్ణమూర్తి అన్నారు. అక్రమంగా నిర్మించిన వసుధ హోటల్‌ని కూల్చి వేతను ఎమ్మెల్యే అడ్డుకోవడం సరైంది కాదన్నారు. ఇది రాజకీయ కుట్ర కాదని, ఎమ్మెల్యే ఇచ్చిన నోటీసుల ప్రకారమే మున్సిపల్ అధికారులు వాళ్ల పని వాళ్లు చేసుకుంటున్నారని అన్నారు.అప్పుడు నోటీసులు ఇచ్చి ఇప్పుడు కూల్చివేయవద్దనడం సరైంది కాదని అన్నారు. ప్రతి ఒక్కరూ కామారెడ్డి పట్టణాభివృద్ధికి సహకరించాలని కోరారు.

## వరంగల్‌కు డీలక్స్ బస్సులు

నేటి నుంచి ప్రారంభం



ఖలీల్‌వాడి, జూన్ 12: నిజామాబాద్ నుంచి వరంగల్ మార్గంలో పెరిగిన రద్దీకి అనుగుణంగా ఉదయం, సాయంత్రం సమయాల్లో కొత్తగా డీలక్స్ బస్సు సౌకర్యం కల్పించినట్లు టీజీఎస్ ఆర్టీసీ ప్రాంతీయ అధికారి జానీరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిజామాబాద్ నుంచి ఉదయం 6.00, 6.45, 7.30, 8.00, 8.30, 9.00, మధ్యాహ్నం 1.00, 1.45, 2.30, 3.00, 3.30, 4.00 గంటలకు వరంగల్ వైపు వెళ్తాయని పేర్కొన్నారు. వరంగల్ నుంచి నిజామాబాద్‌కు ఉదయం 6.00, 6.45, 7.30, 8.00, 8.30, 9.00, మధ్యాహ్నం 1.00, 1.45, 2.30, 3.00, 3.30, 4.00 గంటలకు బయల్దేరుతాయని తెలిపారు. గురువారం నుంచి సర్వీసులను ప్రారంభించనున్నామని, ప్రయాణికులు సర్వీసులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## 'గల్ఫ్' ఆశలు అడియాసలు

- వీసా కోసం ఇంటర్వ్యూకు వెళ్తుండగా.. బైక్‌ను ఢీకొట్టిన డీసీఎం
- ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి
- మల్లుపల్లి గ్రామంలో విషాదం



షేక్ అబ్దుల్లా (ఫైల్),సయ్యద్‌చాంద్ (ఫైల్)

గంభీరావుపేట, జూన్ 12: నిరుపేద కుటుంబానికి చెందిన ఇద్దరు యువకులు కూలీ పని చేస్తూ కుటుంబాన్ని పోషించేవారు. బయటి దేశానికి వెళ్తే.. నాలుగు రూపాయలు సంపాదించుకోవచ్చని ఆశపడ్డారు. ఈ క్రమంలో వీసా కోసం ఇంటర్వ్యూకు వెళ్లేక్రమంలో రోడ్డు ప్రమాదంలో అక్కడికక్కడే మృతి చెందగా, వారి ఆశలు అడియాసలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. కామారెడ్డి జిల్లా భిక్కనూర్ మండలం మల్లుపల్లి గ్రామానికి చెందిన షేక్‌అబ్దుల్లా(32), సయ్యద్ చాంద్(38) ఇద్దరు కూలీ పని చేసేవారు. మస్కట్‌లో జీవనోపాధి పొందేందుకు వీసా ప్రయత్నంలో భాగంగా ఇంటర్వ్యూ కోసం బుధవారం ఉదయం 6గంటలకు మల్లుపల్లి నుంచి సిరిసిల్లాకు ద్విచక్ర వాహనంపై బయల్దేరారు. గంభీరావుపేట మండలం కామారెడ్డి-సిరిసిల్లా ప్రధాన రహదారి పెద్దమ్మ అటవీ ప్రాంతానికి చేరుకోగానే ఎదురుగా వస్తున్న డీసీఎం వ్యాన్.. వీరి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అబ్దుల్లా, చాంద్‌కు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందారు. రోడ్డు ప్రమాదంలో ఇద్దరూ మృతి చెందడంతో మల్లుపల్లిలో విషాదం నెలకొన్నది. విషయం తెలుసుకున్న వెంటనే బాధిత కుటుంబ సభ్యులు బోరున విలపించారు. కాగా, అబ్దుల్లాకు ఇద్దరు కొడుకులు, కూతురు, చాంద్‌కు కొడుకు, కూతురు ఉన్నారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రామ్మోహన్ తెలిపారు.